# డబుల్ డెకర్

బెంగుళూర్ వెళ్ళవలసి వుంటుందని తెలిసినప్పుడే అనుకున్నాడు శేఖర్ - యీమారు 'డబుల్ డెకర్'లో ప్రయాణం చేయాలని. బృందావన్ ఎక్స్‌ప్రెస్‌ను మించింది మరొకటి లేదు, అతని దృష్టిలో. చురుకుగా నడిచే రైలు; దారి పొడుగునా 'సీట్'లో నుండి కదలనక్కరలేకుండా కాఫీ, టీ, తినగల వోపిక వుంటే ఘనపదార్థం, స్వీట్స్, కూల్ డ్రింక్స్, యింకా రక రకాల పదార్థాలు!

ప్రయాణాన్ని మరింత సుఖకరం చేయడానికి 'డబుల్ డెకర్' ప్రవేశ పెట్టారని చూచాడు పేపర్లలో. మనది 'డెవలపింగ్ కంట్రీ' — అయినా అత్యాధునిక సౌకర్యాలు అమర్చుకోవడంలో మనమేం తీసిపోవడంలేదు. బృందావన్ ఎక్స్‌ప్రెస్‌లోనుంచే బెంగుళూరుకు — మద్రాసుకు టెలిఫోన్‌చేసి మాట్లాడగల అవకాశం కల్పిస్తామని వాగ్దానాలు కూడా చేస్తున్నారు.

తండ్రిగారి నుంచి బెంగుళూరుకు వెళ్లి పిల్లను చూచి వచ్చి వెంటనే అభిప్రాయం వ్రాయమని ఆదేశం రావడం తరువాయిగా టికెట్ కోసం 'ట్రావెల్ ఏజెంట్'కు టెలిఫోన్ చేస్తూ 'డబుల్ డెకర్'లో సీట్ సంపా దించమని చెప్పాడు.

'పైనా కిందా సార్' అని అడిగాడు ఏజన్సీ తాలూకు మనిషి.

ఒక్క క్షణం యేంజవాబు చెప్పాలో తోచలేదు శేఖర్‌కు. తరువాత 'పైన' అన్నాడు.

ట్రెయిన్ కోసం ప్లాట్‌ఫాం మీదకు రావడంతోటే పాతరకం 'బోగీ' కనిపించడంతోటే కాస్త నిరాశ అనిపించింది. కాని తనకు చోటు కేటాయిం చిన కంపార్ట్‌మెంట్ దగ్గరకు చేరుకునేటప్పటికి 'జేగురు' రంగులో కొత్త రకం పెట్టె ఆహ్వానిస్తూ నిలబడివుంది.

ప్లాట్‌ఫాంకు దిగువగా కిటికీలు కనిపిస్తున్నాయి.

కంపార్టుమెంటులో ప్రవేశించి తన 'నెంబర్' వెతుక్కుంటూ ముందుకు అడుగులువేశాడు. చిన్న చిన్న అటకలు—వాటిని చేరుకుందుకు రెండు మూడు మెట్ల సీట్లు, 'మీ తల జాగ్రత్తసుమా' అని యింగ్లీషులో నోటీస్‌లు తరుచుగా కనిపించాయి.

మెల్లగా లోపలకు దూరాడు.

పంజరంలో యిరుక్కున్న పక్షుల్లా కూర్చున్నారు అంతా. 'సింగిల్ సీట్' వున్న చోటున అయితే యీ మాట అంత 'ఉత్ప్రేక్ష' కాదు అనిపించింది.

రెండు సీట్లు జంటగా వున్న చోట తన నెంబర్ చూచుకున్నాడు శేఖర్. బ్రీఫ్‌కేస్ ఆ సీటులో జాగ్రతగా వుంచి పక్కకు తిరిగి చేతి రుమాలుతో నుదురు తుడుచుకున్నాడు.

ఎదురుగా సీట్ వయిపు చూచాడు. ముగ్గురు కూర్చునే జాగ. ఓ మధ్యవయసు దంపతులు కూర్చున్నారు.

లోపలకు వచ్చే ప్రయాణీకుల రద్దీ ఎక్కువవుతోంది. సూట్‌కేసులు, భారీ ట్రంకుపెట్టెలు జొరబడుతున్నాయి. పోర్టర్లు 'ప్రక్కకు తొలగండి, దారి యివ్వండి' అని పలుభాషల్లో ప్రస్తావిస్తూ తోసుకుంటు ముందుకు పోతున్నారు.

శేఖర్ మళ్ళీ కిందకు దిగాడు.

ఇంకా అయిదు నిమిషాల విరామం వుంది.

న్యూస్ పేపర్ కోసరం అటు ఇటు చూచాడు. ఎక్కడా స్టాల్ కనిపించలేదు. సిగరెట్లు, కాఫీలు, ఆటవస్తువులు యివన్నీ తోపుడు బళ్లలో వస్తున్నాయి గాని న్యూస్ పేపరు దర్శనంకాలేదు. పత్రికల కుర్రాడు ఓ బండి తోసుకుంటూ పోవడం కనిపించింది కొద్ది దూరంలో. గబగబ నడిచి

ఆ బండిని పట్టుకున్నాడు. న్యూస్ పేపరుకోసం చూస్తే లేదు. ఇంగ్లీషు, హిందీ, కన్నడం పత్రికలు — పుస్తకాలు, క్రైం, రొమాన్స్ పేపర్ బాక్స్ విరివిగా వున్నాయి.

'న్యూస్ పేపర్ లేదా ?'

అడ్డంగా తల ఆడించాడు బండితాలూకు మనిషి.

'ఎక్కడ దొరుకుతుంది ?'

'నేనేం ఎంక్వయిరీ ఆఫీసు కాదు' అన్నట్లుగా ముఖం పెట్టి అతడు చేయి బారజాపి దూరంగా 'ఎంట్రెన్స్ గేట్' వంక చూపాడు

శేఖరానికి ఉసూరు మనిపించింది ఇప్పుడు అంతదూరం వెళ్ళి రావటానికి సమయం చాలదు. తను స్టేషన్‌కు వస్తూ వున్నప్పుడే దారిలో 'పికప్' చేసుకుంటే సరిపోయేది. హడావిడిలో మరచిపోయాడు. పొద్దున్నే ఇడ్లీ కాఫీలకువున్న 'డిమాండ్' న్యూస్ పేపర్లకు లేకపోవడం మన దేశ దౌర్భాగ్యం అనుకున్నాడు. ప్రతివాడూ తప్పనిసరిగా దినపత్రిక కొనుక్కుంటే - పేపరు కుర్రాళ్ళు బిలబిలలాడుతూ తిరుగాడుతూ వుండేవాళ్ళు!

అతను తిరిగి సీట్‌లోనికి వచ్చి కూర్చోవడంతోటే ఎదురుగా 'హిందూ' పేపర్ కనిపించింది. ఆశగా దానివంక చూచాడు. అతని ముఖంలో 'ఆశ' కొట్టవచ్చినట్లుగా కనిపించి వుంటుంది— ఎదురు ప్రయాణీకుడు 'కావాలంటే తీసుకోండి' అని అందించాడు, శేఖర్ అడగకుండానే.

'థాంక్స్! పేపర్ కోసం కిందికి వెళ్లాను. దొరకలేదు' అన్నాడు ఎపోలజెటిక్‌గా.

'ఫరవాలేదు, చదువుకోండి' అన్నాడతను.

ట్రెయిన్ బయలుదేరిన తరువాత చాలసేపటివరకూ పేపర్ చదువుకొంటూ వుండిపోయాడు. శనివారం అవడంవల్ల 'ఓపెన్ పేజ్'లో వచ్చిన వ్యాసాలు అభిరుచిదాయకంగా ఆలోచింపజేసేవిగా వున్నాయి. సంపాదకీయం, మిడిల్ పేజి వ్యాసాలు సరేసరి!

చాలదూరం వెళ్లిన తరవాత కాఫీ వస్తే ఆ కేకకు వులిక్కిపడి ఓ కప్పు అడిగి పుచ్చుకున్నాడు.

ఇలాంటిచోట కూడా 'బేరర్' ఎందుకట్లా బిగ్గరగా అరుస్తాడో అర్థం కాలేదు శేఖర్ కు. బహుశ 'అలవాటుదోషం' అయి వుంటుంది,

ఎదురుగా కూర్చున్న ఆసామి కాస్త పరిచయంగా నవ్వి 'బృందావన్ డబుల్ డెకర్' మీద మీ అభిప్రాయం ఏమిటీ?' అన్నప్పుడు కొన్ని నెలల క్రితం టి. వి. లో చూచిన ఇంటర్వ్యూ గుర్తు వచ్చింది శేఖర్ కు.

'బాగుంది' అన్నాడు ముక్తసరిగా.

'చాలమంది ప్రయాణికులు దీన్ని సపోర్టు చేయడంలేదు. కష్టాల పరంపర చెబుతున్నారు' అన్నాడు ఆయన.

'కొత్త పద్ధతి! మార్పు జనానికి ఇష్టం వుండదు. వాళ్ల అంగీకారం దొరకటానికి చాల టైం పడుతుంది,'

'సామానుతో ప్రయాణం చేసేవాళ్లకు యిబ్బంది. లయిట్ లగేజ్ కు కూడా అరలేదు. హెవీ లగేజ్ వున్నవాళ్ల గోల పరమాత్ముడికే తెలియాలి.'

'తక్కువ సామానుతో ఎక్కువ సౌకర్యంగా ప్రయాణం చేయండి - అని దాదాపు ముప్పయి సంవత్సరాల నుండి ప్రచారం చేశారుగదా - రైల్వే వాళ్ళు. ఈసరికి జనం యీ మార్పుకు సరిపడిపోయి వుంటారనుకున్నారు!'

'ఎంత తక్కువ సామాను అయినా-కొంత తప్పదుగదా! సూట్ కేస్, చేతిసంచి, నీళ్లసీసా.... పిల్లలతో ప్రయాణం చేస్తుంటే పాలసీసాల కిట్.... యివన్నీ తప్పనిసరిగా వుండవలసిన సరంజామా కదండీ!' అన్నాడు అతను.

'అవునవును' అన్నాడు శేఖర్ ఆయన చెప్పినది కాదంటే సంభాషణ హనుమంతుడి తోకలాగ యింకా పెరిగిపోతుందేమోనని భయపడి పోయి. ప్రయాణాలలో మనుషులతో పూసుకుని కలివిడిగా మాట్లాడడం,

కొత్తపరిచయాలు చేసుకోవడం - పెంచుకోవడం శేఖర్‌కు అలవాటులేదు. అయినా అతని ప్రమేయం లేకుండానే ప్రయాణాలన్నీ కులాసాగా ఎక్కువ ప్రయాసలేకుండా నడిచిపోతాయి.

'మద్రాసులో వుంటారా మీరు, బెంగుళూరా?' అనడిగాడు, ఎదురు ప్రయాణీకుడు.

'మద్రాసేనండీ. పనిమీద బెంగుళూరు వెడుతున్నాను.'

'అలాగాండీ! మాదీ మద్రాసు. వారం రోజులు వుందామని వెడుతు న్నాము బెంగుళూరుకు. మా తోడి అల్లుడు వున్నాడు అక్కడ.'

కొంతసేపు నిశ్శబ్దం.

తరువాత ఆయనే అన్నాడు: 'ఇంక కొన్నాళ్ళకు రెండు బృందా వనాలు వేస్తారుట! అటు యిటు కూడా! అప్పుడు ప్రయాణం మరింత హాయిగా వుంటుందేమో!'

'ఇప్పటికే బెంగుళూరు, మద్రాసు ట్విన్ సిటీస్ అనుకుంటున్నారు చాలమంది.'

'రాజకీయంగా ఎలా వున్నా... పరస్పర సంబంధ బాంధవ్యాలు, ఆఫీసు కార్యకలాపాలు, పరిశ్రమల దోహదం.... యీ రెండు నగరాలకు ఎక్కువ. మద్రాసులో వున్న ప్రతివాళ్లకూ దాదాపు బెంగుళూరుతో పరి చయం వుంటుంది. అలాగే బెంగుళూరు వాళ్లకు కూడా!'

'సాంస్కృతికంగా రెండూ దగ్గర. భరతనాట్యం ట్రూప్స్, సంగీత కచేరీవాళ్ళు మదరాసు నుంచి బెంగుళూరుకు తరచుగా వెడుతూ వుంటారు. ఇంజనీరింగ్ సంస్థలకు బ్రాంచీలు వున్నట్లుగానే వాటి యజమానులకు, వుద్యోగులకూ రెండుచోట్లా బంధు బలగం వుంటుంది-సహజం.'

'మదరాసులో వున్న యువకులు చాలమంది తమ అత్తవారి ఊరు బెంగుళూరు అని చెబుతూ వుంటారు' అంది ఆమె అప్పుడే వాళ్ల సంభాష ణలో ప్రవేశిస్తూ.

శేఖర్ అంతవరకూ ఆమెను గమనించలేదు. అంటే ఆమె అస్తిత్వాన్ని గుర్తించలేదని కాదు. స్త్రీలపట్ల సూటిగా—తరుచుగా చూడడం సభ్యత కాదు గనుక తల అటు వైపు తిప్పకుండా ప్రయత్నపూర్వకంగా తప్పించుకుంటూ వచ్చాడు యింతవరకూ. 'యువకులు-అత్తవారూ' అనడంతో ఒక్కమారుగా ఆమె ముఖం వయిపు చూచాడు. చాలమంది ఆడవాళ్లకు సిక్త్స్ సెన్స్ వుంటుందని చదివాడు శేఖర్-పుస్తకాలలో. ఆమెను చూడడంతోటే యీ విషయం స్ఫురణకు వచ్చింది. కొంపతీసి యీమె కూడా ఆ కోవకు చెందింది కాదుగదా! తను పెళ్ళి చూపులకు బెంగుళూరు వెడుతున్నాడని పసిగట్టిందా యేం? అనుకున్నాడు.

'అలా ఉలిక్కిపడ్డారేం? మీ అత్తవారివూరు బెంగుళూరా?' అన్నాడు అతను.

శేఖర్ మళ్ళీ ఉలిక్కిపడి 'కాదండీ' అన్నాడు. అతని బుగ్గలు ఎర్రబడడం ఆమెకు స్పష్టంగా కనిపించింది.

'ఇంకా పెళ్లి కాలేదేమో. మీరేమిటి అంతా తెలిసినట్లు అడుగుతారు-' అంది ఆమె భర్తతో కాస్త కోపంగా.

శేఖర్‌కు యీమెకు సిక్త్స్ సెన్స్ వున్నదన్న విషయం రూఢి అయిపోయింది. తను జాగ్రత్తపడకపోతే లాభంలేదనుకున్నాడు.

'మీరు చెప్పిందే కరెక్టు!' అన్నాడు.

'అయితే మీరు పెళ్లికొడుకుల జాబితాలో వున్నారన్నమాట!'

శేఖర్ నవ్వి వూరుకున్నాడు.

'ఈ రోజుల్లో-కుర్రాళ్లు ఉద్యోగంలో స్థిరపడి ఆర్థికంగా హంగు చిక్కితేగాని వివాహానికి వొప్పుకోవటంలేదు. నన్ను అడిగితే అదే మంచి పని అంటాను. మంచి బాధ్యత అయినపని. వెనకటి రోజుల్లో మీ ఆంధ్ర దేశంనుంచి పెళ్ళిళ్లయి సంసారం మొదలుపెట్టిన వాళ్లు కాలేజీ చదువుల

కోసం మద్రాసులో భార్యలతో సహా కాపురం పెట్టటం నాకు తెలుసు' అన్నారాయన.

తను యేమీ అనకపోతే యీ సంభాషణ యింకా పెళ్ళిళ్లగురించి ఎంతోదూరం పోతుందని భయపడ్డాడు శేఖర్.

ఏదో అబద్ధం చెప్పయినా విషయం మార్చకపోతే ప్రమాదంలో చిక్కుకుపోవడం తప్పదు.

'నాకింక యిద్దరు అన్నయ్యలూ, యిద్దరు చెల్లెళ్ళూ వున్నారండీ! పెళ్ళి కావలసినవాళ్లు. మరో ఐదు సంవత్సరాలదాకా నాకు ఆ ఆలోచన లేదనుకుంటాను' అన్నాడు గబగబ.

'అదృష్టవంతులు' అన్నాడు ఆయన. 'ఈ లోపల జీవితానికి కావలసినవన్నీ సేకరించుకోవచ్చును.'

శేఖర్ మరోమారు తాపీగా ఆమెవంక చూశాడు. నలభయ్యేళ్లు దాటుతున్న మనిషి, ఒకటి రెండుమార్లు చూడాలనిపించే ఆకారం ఆమెది అనుకున్నాడు. ముఖం మంచి వర్చస్సుతో నిండుగా వుంది.

ఆయన్నూ, ఆమెను చూస్తూవుంటే మాంచి చలాకీ అయిన దంపతులు అనిపించింది. ఒకళ్లకోసం ఒకళ్లు-అన్నట్లుగా బాగా అర్థంచేసుకుని సజావయిన సంసారం నడుపుతున్న జంట-అనుకున్నాడు. శేఖరానికి యిలా స్వాప్నికంగా ఊహాలోకంలో యితరుల సుఖసంతోషాలను గురించి అంచనా వేసుకోవడం యిష్టమయిన ఊహ.

రైలు యేదో స్టేషన్లో ఆగింది.

జనం కంపార్టుమెంట్ నుంచి కిందకు దిగుతున్నారు. ఎక్కేవాళ్ళు యెవరూలేరు ఈ ద్వారంనుంచి. అందువల్ల ఏమంత రద్దీ అనిపించలేదు.

శేఖర్ క్రిందకు వెళ్లాడు. డబుల్ డెకర్ బేస్‌మెంట్‌లోకి. భూగృహంలో ప్రవేశిస్తున్నట్లు వుంది.

అక్కడ నుంచి ప్లాట్‌ఫారం వయిపుచూస్తే ఉరుకులు పరుగులు పెడుతున్న జనప్రవాహం మీద పడబోతున్నట్లు అనిపించింది! వెలుతురు తక్కువ. బెడ్డింగు సామానులకు చోటే లేదు.

రైలంతా బాగానే వుంది కాని 'లగేజ్‌రూం' ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అందరి సామాన్లు - 'రీడింగ్ మెటీరియల్' తప్ప - అక్కడ చేర్చి మనుషులు హాయిగా ప్రయాణం చేయడానికి వీలు కల్పిస్తే బృందావనం ఎప్పటిలాగ సుఖ ప్రయాణానికి అనువయిన ట్రెయిన్‌గా వుండిపోతుంది - అనిపించింది శేఖర్‌కు.

అతను మళ్లీ తన సీటుకు వచ్చి కూర్చునేటప్పటికి రైలు బయలు దేరింది.

ఆ దంపతులు మాట్లాడుకుంటున్నారు.

రహస్యాలు కాదు గాబోలు-పెద్దగానే వినిపిస్తున్నాయి వాళ్లమాటలు. శేఖర్ ఏమీ ప్రయత్నించకుండానే వాళ్ల సంభాషణ వినగలుగుతున్నాడు.

'మీ అక్కగారి కారు వస్తుందనుకుంటాను స్టేషన్‌కు.'

'ఆ! సుమిత్ర తనే డ్రైవ్ చేసుకు వస్తుంది, చూస్తూ వుండండి.'

'అన్నట్లు మీ సుమిత్ర పెళ్లి యేమయింది?'

శేఖరానికి అనిపించింది, యీ పెద్దమనిషికి యెంతసేపూ పెళ్ళిళ్ల గొడవ తప్ప యింకేం పట్టదా యేమిటని!

'చూస్తున్నారు!'

'ఇంకా ఎం. ఏ. ఫస్టియర్‌లోనే వుంది గదూ?'

శేఖర్‌కు మనసులో యేదో కదలబారినట్లయింది. యం.ఏ. ఫస్టియర్ సుమిత్ర!

'చదువు విషయం అంత పట్టింపు లేదు మా అక్కయ్యకు, బావగారికి కూడా. మంచి సంబంధం దొరకడంతోటే పెళ్ళి చేసేయాలని చూస్తున్నారు, కాని సుమిత్రే పేచీ పెడుతోందట!'

'యేమని ?'

'యేమిటో నాకూ వివరంగా తెలియదు సుమండీ! కనుక్కుందాంగా వెళ్ళాక.'

'పోనీ నీకు తెలిసినంతవరకు చెప్పు — కాలక్షేపం అవాలిగా!'

'సుమిత్ర వాళ్ళ కాలేజిలో ఓ కుర్ర లెక్చరర్‌ను ప్రేమించిందట. వ్యవహారం పెళ్ళిదాకా వెళ్ళింది. కాని, బావగారూ....'

'కూడదన్నారా ?'

'లెక్చరర్ ఉద్యోగం ఏమంత గొప్పది కాదని తటపటాయిస్తున్నారు. కాస్తో కూస్తో కట్నం యివ్వగల స్తోమతు వున్నప్పుడు పెద్ద ఉద్యోగస్తుడినీ, భారీ ఆస్తిపాస్తులు వున్నవాడినీ సంపాదించే అవకాశం వుందిగదా అని ఊహ !'

'వేరే సంబంధాలు చూస్తున్నారా మరి?'

'అవును.'

'మరి సుమిత్ర వూరుకుందా? ప్రేమ గీమ అని అల్లరిచేయగలంలా?'

'చేయకేం చేస్తూనే వుందిట. ఆస్తిపాస్తులు - గొప్ప హోదా వున్న వరుడు తక్కువ కట్నంతో దొరికితే అలాగే చేసుకుంటుంది. తన చదువూ చక్కదనమే కట్నంగా వచ్చేవాడు ఉంటే—పాత ప్రేమ కథలన్నీ గుంటబెట్టి గంట వాయిస్తానని అక్కయ్యతో చెప్పిందట !' ఆయన ఆలోచనలో పడి నట్లున్నాడు. ఎదురు ప్రశ్న యేమీ వేయలేదు.

'ఈ చదువు పూర్తయే లోపల మరో మంచి సంబంధం దొరికితే సరేసరి. లేకపోతే ఆ లెక్చరర్ వుండనే వున్నాడు - అని మా అక్కయ్య గూడా సమాధానపడ్డానని వ్రాసింది మొన్న' అంది ఆమె.

ప్రేమించి పక్కన పెట్టుకుంటే—ఎప్పటికయినా పనికి వస్తుందని-అన్న మాట! అయితే మీ సుమిత్ర మంచిగడుసు పిల్లే!'

శేఖర్‌కు మనసంతా వికలం అయిపోయింది.

బెంగుళూరు స్టేషన్‌లో రైలు ఆగీ ఆగడంతోటే, ద్వారం ముందు వి. ఐ. పి. ఎడ్వర్‌టైజ్‌మెంటు లాగ పేర్చిన సూట్ కేసులు, బ్రీఫ్ కేసులు దాటుకుంటూ ప్లాటుఫాం మీదకు దూకి బయటకు వెళ్ళి - టికెట్టు కౌంటర్ ముందు 'క్యూ'లో నిలబడ్డాడు; మదరాసుకు ముఖం పెట్టి.

[ ఈ కథ వ్రాసిన తర్వాత రైల్వేవాళ్ళు 'డబుల్ డెకర్' విత్‌డ్రా చేసేసారు. అందుకని వాళ్ళకు అంకితం. ] *

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)